క్లుప్తంగా

ఆర్బీకేల్లో రైతు భరోసా అర్హుల జాబితా



వేంపాడు ఆర్బీకేలో జాబితా ప్రదర్శిస్తున్న సిబ్బంది

నక్కపల్లి: మండలంలో రైతు భరోసా రెండో విడత ఆర్థిక సాయానికి సంబంధించి అర్హులైన లబ్ధిదారుల జాబితాలను అన్ని ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచుతున్నట్లు మండల వ్యవసాయాధికారి శుక్రవారం ఉమాప్రసాద్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడి సాయం కింద ఏటా రెండు విడతల్లో చెల్లింపులు చేస్తోందన్నారు. మొత్తం 12,638 మంది లబ్ధిదారులకు రూ.2.70 కోట్లు ఈ నెల 7న వారి ఖాతాల్లో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలను వినియోగించుకోండి



కళ్లద్దాలు అందిస్తున్న స్థానిక నాయకులు

మునగపాక: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ సేవల్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు కోరారు. తోటాడ సచివాలయంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. స్థానిక ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మితో కలిసి కళ్లద్దాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ప్రతీ ఒక్కరి ఆరోగ్యానికి భరోసా కలుగుతోందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి విమలగిరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి



మాట్లాడుతున్న సమరసతా సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ ధర్మ ప్రచారకులు అప్పారావు

మునగపాక: ప్రతిఒక్కరూ హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలని సమరసతా సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు కోరారు. స్థానిక సంతబయల రామాలయంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్తీక పౌర్ణమి నాడు దేవాలయాల్లో సామూహిక హారతి కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఈ నెల 9, 23 తేదీల్లో ఏకాదశి సందర్భంగా నగర సంకీర్తనలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ మండల కన్వీనర్ ఆడారి లక్ష్మణరావు, కో–కన్వీనర్ కొణతాల వెంకటరావు, పెంటకోట అప్పారావు,ఆడారి గోపి, సత్యనారాయణ, రూపావతి తదితరులు పాల్గొన్నారు.

అమూల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



అమూల్ పాడి రైతులకు స్టీల్ క్యాన్లు అందిస్తున్న దృశ్యం

మునగపాక: ప్రతి ఒక్కరూ అమూల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని హరిపాలెం మహిళా సహకార సంఘం అధ్యక్షురాలు కాండ్రేగుల అన్నపూర్ణ కోరారు. హరిపాలెంలో శుక్రవారం అమూల్ పాడి రైతులు 65 మందికి రూ.లక్షా 70 వేల మేర బోనస్‌తో పాటు స్టీల్‌క్యాన్లు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా పాడిరైతుల ఆర్థికాభివృద్ధికి అమూల్ దోహదం చేస్తోందన్నారు. కార్యక్రమంలో పెద్దలు మారిశెట్టి సూర్యనారాయణ(ఎంఎస్), కాండ్రేగుల రామప్పలనాయుడు, ఎంపీటీసీ శరగడం ప్రసాద్, మాజీ వైస్ ప్రెసిడెంట్ పెంటకోట అప్పారావు, అమూల్ ప్రతినిధి శ్రీకాంత్ పాటిల్, ఇన్‌చార్జి పి.సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సీఎం అయితే మరింత సంక్షేమం, అభివృద్ధి

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు తిప్పల గురుమూర్తిరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న పార్టీ పరిశీలకుడు గురుమూర్తిరెడ్డి



హాజరైన కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు

కోటవురట్ల: 'ఏపీకి వెళ్లండి.. అక్కడ అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాలను పరిశీలించి, మీ రాష్ట్రాల్లో కూడా అమలు చేయడానికి ప్రయత్నించండి'అని సాక్షాత్తూ ప్రధాని నరేంద్ర మోదీ తరచూ అంటున్న మాటలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు తిప్పల గురుమూర్తిరెడ్డి అన్నారు. విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారత, అభివృద్ధి ఇవన్నీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్దేశించుకున్న అద్భుత లక్ష్యాలని పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట పార్టీ నాయకులు, గృహ సారథులు, కన్వీనర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు.

బీసీ సామాజిక సాధికార బస్సు యాత్ర, ఏపీకి జగనే ఎందుకు కావాలి? అంశాలపై చైతన్య వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా గురుమూర్తిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగాక ఏపీలో పరిస్థితులు దారుణంగా ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి అద్భుతమైన సంక్షేమాన్ని ప్రజలకు అందించారని కొనియాడారు. ఈ రోజున విద్య, వైద్య పరంగా ఏపీ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఇవన్నీ మరింత బాగా అమలవ్వాలంటే ఏపీకి మళ్లీ జగనే సీఎం కావాలన్నారు. జరిగిన సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి, వారిని చైతన్య పరచాలన్నారు.

ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మాట్లాడుతూ ప్రతీ యుగానికి ఓ కారణజన్ముడుంటాడు.. సీఎం జగన్ ఆ కోవకు చెందినవారేనని కొనియాడారు. తాను దివంగత సీఎం వైఎస్సార్ శిష్యుడిగా ఆయన సంక్షేమ పాలనను చూశానని, అంతకంటే గొప్పగా సీఎం జగన్ పరిపాలన చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి ముఖ్యమంత్రిని తన జీవితంలో చూడలేదన్నారు. మళ్లీ జగన్‌ను సీఎంగా చేసుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కాలర్ ఎగురవేసి సగౌరవంగా తిరిగేలా జగన్ పాలన ఉందన్నారు. మళ్లీ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడాలన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్ఎస్ సీతారామరాజు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పైల రమేష్, పార్టీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి యల్లపు కుమారరాజా, కార్యవర్గ సభ్యుడు శెట్టి రమణ, పార్టీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణ, శింగంపల్లి కిషోర్, సర్పంచ్ బి.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవరచుకోవాలి



జువ్వాలమ్మ తల్లిని దర్శించుకుంటున్న డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ తదితరులు

మునగపాక(అచ్యుతాపురం): ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవరచుకోవాలని డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమారవర్మ(తేజ) తెలిపారు. మండలంలోని పెదపాడులో శుక్రవారం జువ్వాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవాలయాలను సందర్శించడం ద్వారా మానసిక ప్రశాంత లభించడంతో పాటు ఆరోగ్యం కుదుటపడుతుందన్నారు. ఎంపీపీ కోన సంధ్య బుజ్జి, దుప్పుతూరు సర్పంచ్ దేశంశెట్టి శంకరరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పిన్నమరాజు వాసు, జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు నర్మాలకుమార్, పార్టీ సీనియర్ నేతలు మారిశెట్టి సూర్యనారాయణ, బుద్ద వెంకటరమణ, బలిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



అధ్యక్ష, కార్యదర్శులు సంగీత్‌రాజ్, లోవరాజు

కోటవురట్ల: ఏపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి సత్యాడ దాసు, ఉపాధ్యక్షుడు పడాల అప్పారావు పరిశీలకులుగా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్.సంగీత్‌రాజ్, పి.లోవరాజు, గౌరవ అధ్యక్షులుగా ఇ.సత్తిబాబు, ఎస్.సన్యాసిరావు, కె.బాలచంద్రుడు, ముఖ్య సలహాదారులుగా ఎం.ఆనంద్‌రాజ్, ఆర్.ప్రసన్నకుమార్, ఎ.శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిలర్లుగా ఎం.కృష్ణప్రసాద్, ఎస్.లచ్చబాబు, సీహెచ్ జాన్‌సుధాకర్, ఆర్.రమాదేవి, ఉపాధ్యక్షులుగా పి.రాము, ఎస్.జీవన్‌రావు, కె.అప్పలనాయుడు, కె.సాంబశివరావు, కార్యదర్శులుగా బి.తంబి రాజేంద్రప్రసాద్, పి.సత్యనారాయణ, బి.అప్పారావు, మహిళా కార్యదర్శులుగా ఎస్.ఐశ్వర్య, ఎ.శోభ, ఎస్ఏఎస్ కుమారి, ఆడిటర్లుగా ఎ.తలుపులు, టి.శ్రీనివాసరావు, కె.సూరిబాబులను ఎన్నుకున్నారు.

చెకుముకి పోటీలతో శాస్త్రీయ దృక్పథం పెంపు



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న దృశ్యం

మునగపాక(అచ్యుతాపురం): విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంలో చెకుముకి సైన్స్ సంబరాలు ఎంతగానో దోహదపడతాయని ఎంఈవో దేవరాయలు తెలిపారు. అచ్యుతాపురం మండల వనరుల కేంద్రంలో శుక్రవారం చెకుముకి సైన్స్ పోటీల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపేందుకు ఇలాంటి పోటీలు ఉపయోగపడతాయన్నారు. ఈ విద్యా సంవత్సరంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు నవంబర్ 10న పాఠశాల స్థాయిలోను, 30న మండల స్థాయి, డిసెంబర్ 17న జిల్లాస్థాయి, జనవరి 27, 28 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు మారిశెట్టి వెంకటఅప్పారావు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జీఎస్ ప్రకాష్, బి.వెంకటేశ్వరరావు, మురళి, మద్దిల నానాజీ, పట్నాల నాగేశ్వరరావు, మూర్తి, సూర్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

కశింకోట: ఆయుర్వేదం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కన్నూరుపాలెం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి కె.లావణ్య అన్నారు. ఆయుర్వేద వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కన్నూరుపాలెం హైస్కూల్లో ఆయుర్వేదంపై శుక్రవారం అవగాహన కార్యకమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుర్వేదం భారత దేశంలో ఆవిర్భవించిన ఆయుర్వేద వైద్యాన్ని విదేశాల్లో కూడా అనుసరిస్తున్నారన్నారు. ఆయుర్వేదంలో దాదాపు అన్ని రకాల వ్యాధులకు వైద్యం ఉందన్నారు. కరోనా నివారణకు ఆయుర్వేద మందులను అందించిన విషయాన్ని గుర్తు చేశారు. దీర్ఘ కాలిక వ్యాధులతోపాటు, సీజనల్ వ్యాధులు కూడా ఆయుర్వేద మందులతో త్వరగా నయం అవుతాయన్నారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ జరిపి, విద్యార్థులకు మన నిత్య జీవనంలో ఆయుర్వేదం అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

30 పాఠశాలల్లో అభ్యసన సామర్థ్య పరీక్షలు



సీస్ పరీక్ష రాస్తున్న విద్యార్థినులు

అనకాపల్లి రూరల్: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను గుర్తించేందుకు మండలంలోని 30 పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించిన స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(సీస్)–2023 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన ఈ పరీక్షలకు పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల విద్యార్థులు 1,170 మంది హాజరయ్యారు. 3, 6 తరగతుల విద్యార్థులకు తెలుగు/ఇంగ్లిష్, గణితం, పరిసరాల విజ్ఞానం, 9వ తరగతి విద్యార్థులకు తెలుగు/ఇంగ్లిష్, గణితం, సోషల్, సైన్స్ సబ్జెక్టులపై పరీక్ష నిర్వహించారు. ఓఎంఆర్ పద్ధతిలో నిర్వహించిన ఈ పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాలను సీల్డు కవర్లలో భద్రపరిచారు. పరీక్షలు సజావుగా నిర్వహించడానికి 49 మంది ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లను నియమించారు. మండలంలో పరీక్షలు పకడ్బందీగా, ప్రశాంతంగా జరిగాయని యలమంచిలి ఎంఈవో–1 వై.మీనాక్షి తెలిపారు.

రోటరీ క్లబ్ సేవలు విస్తృతం



మాట్లాడుతున్న క్లబ్ చైర్మన్ సుబ్బారావు

అనకాపల్లిటౌన్: రోటరీ సేవలు మరింత విస్తృతం చేస్తామని రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ ఆర్‌వీ సుబ్బారావు అన్నారు. స్థానిక క్లబ్ ఆవరణలో శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ఇప్పటికే క్లబ్ చాలా సేవా కార్యక్రమాలు చేపట్టిందన్నారు. సేవలు మరింత పెంచే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. అంతకుముందు హైస్కూల్, కళాశాలకు చెందిన 53 మంది విద్యార్థులకు ఎండోమెంట్ స్కాలర్‌షిప్‌లు, బీసీ వసతిగృహ విద్యార్థులకు 120 ట్రంకు పెట్టెలు, మహిళలకు కుట్టుమిషన్లు, వెట్‌గ్రైండర్లు అందించారు.

'విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి'



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న విజిలెన్స్ సీఐ తిరుపతిరావు

మునగపాక: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని విజిలెన్స్ సీఐ సీహెచ్ తిరుపతిరావు కోరారు. చదువులో ఏకాగ్రత ఉంటే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. మండలంలోని నాగులాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం విజిలెన్స్ అవేర్‌నెస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో పాటు ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందన్నారు. నిరంతర సాధన ద్వారా కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్ఐ డి.రవికుమార్, హెచ్‌ఎం శంకరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేటలో ఓటర్లు.. 2.44 లక్షలు

నక్కపల్లి: ప్రకటించిన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం పాయకరావుపేట నియోజకవర్గంలో 2,44,676 మంది ఓటర్లు ఉన్నట్లు తహసీల్దార్ అంబేడ్కర్ శుక్రవారం తెలిపారు. గత నెల 27న ప్రచురించిన జాబితా మేరకు పురుషులు 1,20,778 మంది, మహిళలు1,23,896 మంది, ఇతరులు ఇద్దరు ఓటర్లుగా నమోదయినట్లు పేర్కొన్నారు. 2024 జనాభా అంచనా ప్రకారం పురుషులు1,66,656 మంది, మహిళలు1,68,608 మంది మొత్తం 3,35,264 మంది ఉన్నట్లు తెలిపారు. 18 ఏళ్లు నిండిన వారు కొత్తగా ఓటు హక్కు పొందేందుకు, ముసాయిదా జాబితాలో మార్పులు చేర్పుల కోసం శని, ఆదివారాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. మార్పులు చేర్పులు, తొలగింపులకు డిసెంబరు 9వ తేదీ వరకు గడువు ఉన్నట్లు పేర్కొన్నారు.

20 నుంచి కుసుమహరనాథ్ నామసప్తాహం

అనకాపల్లిటౌన్: పట్టణంలోని గవరపాలెం కోటవీధి కుసుమ హరనాథ్ మందిరంలో ఈ నెల 20 నుంచి 27 వరకు నామ సప్తాహ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మందిర సభ్యులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జయహరనాథ జయ– కుసుమకుమారి జయ నామంతో సప్తాహం, 26న కుసుమహరనాథ లీలా కల్యాణ మహోత్సవం నిర్వహించి, 27న దివ్య హారతితో వేడుకలు ముగుస్తాయన్నారు.

ఉచితంగా కళ్లద్దాల పంపిణీ



బీఆర్టీ కాలనీలో రోగులకు కళ్లద్దాలు అందజేస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లి రూరల్: మండలంలోని బీఆర్టీ కాలనీలో శుక్రవారం దృష్టి లోపం ఉన్న కంటి రోగులకు వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకుడు దాడి రత్నాకర్ ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. సెప్టెంబరు 25న ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా ఈ కాలనీలో జరిగిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఉచితంగా కళ్లద్దాలు ఇస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు కాలనీకి వెళ్లి గతంలో గుర్తించిన వారందరికీ తన సొంత నిధులతో కొనుగోలు చేసిన కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్టీ కాలనీతో తన తండ్రి వీరభద్రరావు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నప్పటి నుంచి మంచి సంబంధాలున్నాయన్నారు. ఈ కాలనీ తన తండ్రి హయాంలోనే ఏర్పాటైన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పేదల ఆరోగ్యాన్ని మెరుగుపర్చేందుకు ఎన్నో విప్లవాత్మకమైన చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వాస్పత్రుల బలోపేతంతో పాటు, గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, అర్బన్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటు, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ఇంటి ముంగిటకే వైద్య సేవలు అందుతున్నాయని కొనియాడారు. ఇంత గొప్ప కార్యక్రమాలు దేశంలో వేరెక్కడా అమలు కావడం లేదన్నారు. కార్యక్రమంలో పిసినికాడ ఎంపీటీసీ మొల్లేటి హైమ, శివాజీ, రత్నాల ప్రకాశరావు, పీలా సంతోష్, భీశెట్టి తాతారావు, పి.ప్రదీప్, పోలిశెట్టి ఈశ్వరరావు, మారిశెట్టి రాము, బుద్ధ సత్యనారాయణ, మారిశెట్టి సంతోష్, బమ్మిడి రాధిక, లక్ష్మి, కీర్తి పాల్గొన్నారు.

ప్రజలను ఓటడిగే హక్కు వైఎస్సార్‌సీపీకే ఉంది



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు



మండల అధ్యక్షుడు గోవిందరావుని సత్కరిస్తున్న గొల్ల బాబూరావు, బొడ్డేడ ప్రసాద్, తిప్పల గురుమూర్తిరెడ్డి

కార్యకర్తల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు

ఎస్.రాయవరం: ప్రజల్లోకి వెళ్లి ఓటు అడిగే హక్కు ఒక్క వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకే ఉందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. పి.ధర్మవరం గ్రామంలో ఎందుకు ఆంధ్రాకి జగనే కావాలి? కార్యక్రమాన్ని పురస్కరించుకుని ముందస్తుగా కార్యకర్తలు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, నియోజకవర్గ పరిశీలకులు తిప్పల గురుమూర్తిరెడ్డిలు మాట్లాడుతూ గ్రామంలో ప్రజల వద్దకు పార్టీ శ్రేణులు వెళ్లినపుడు 2014 ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చారు, 2019 ఎన్నికల్లో సీఎం జగన్ ఇచ్చిన హామీలో ఎన్ని అమలు చేశారో.. వివరించాలన్నారు. దీనిపై ప్రజల నుంచి అభిప్రాయాలను సాధ్యమైన మేరకు లిఖితపూర్వకంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని పకబ్బందీగా నిర్వహించాలని సీఎం జగన్ ఆదేశించినటున్ల తెలిపారు. చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ మోసపూరిత మాటల్ని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. పార్టీ నిర్వహించబోయే ప్రతి కార్యక్రమం క్రమశిక్షణతో చేపట్టి, సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలన్నారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, జెడ్పీటీసీ కాకర దేవి మాట్లాడారు.

కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, అనకాపల్లి జిల్లా కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, ఎంపీపీ కోన లోవలక్ష్మి, నక్కపల్లి మండల అధ్యక్షుడు శీరం నరసింహమూర్తి, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, సర్పంచ్‌లు భూపతి అప్పారావు, శానాపతి శ్రీరాములు, ఎంపీటీసీలు సూరిబాబు, వెంకటలక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షులు అల్లాడ నాగరాజు, దోసపాత్రుని హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీపతిరాజు, అద్దేపల్లి బొజ్జన్న, పాలిశెట్టి పెద ఈశ్వరరావు, కశింకోట నీలేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ సేవలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న విశాఖ డెయిరీ చైర్మన్ ఆనంద్‌కుమార్

మునగపాక(అచ్యుతాపురం): విశాఖ డెయిరీ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ కోరారు. మండలంలోని ఎం.జగన్నాథపురం పాల సంఘం ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మేలుజాతి పశువులను పెంచడం ద్వారా అధిక పాల దిగుబడులతో పాటు, మెరుగైన ఆదాయం సమకూరుతుందన్నారు. ఆవులు, గేదెల ఎద సమయంలో ఇచ్చే ఇంజక్షన్లతో నూటికి 98 శాతం ఆడ పెయ్యిలు పుట్టే అవకాశం ఉందన్నారు. ఇంజక్షన్ల ద్వారా పుట్టిన ఆడ పెయ్యిలను పరిశీలించారు. పాడి రైతులకు ఎటువంటి అనారోగ్యం సంభవించినా విశాఖ ఐకాన్ ఆస్పత్రి ద్వారా మెరుగైన వైద్యం అందజేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డెయిరీ డైరెక్టర్లు మలసాల రమణారావు, గేదెల సత్యనారాయణ, పాలసొసైటీ అధ్యక్షులు సేనాపతి వంశీ, సర్పంచ్ కరెడ్ల ప్రకాష్, పిన్నమరాజు రవీంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాలు



తహసీల్దార్ ఎస్ రాణీఅమ్మాజీ

యలమంచిలి(అనకాపల్లి రూరల్): ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల కమిషన్ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తహసీల్దార్ ఎస్.రాణీఅమ్మాజీ శుక్రవారం తెలిపారు. శనివారం, ఆదివారం పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేక శిబిరాల వద్ద బీఎల్వోలంతా తప్పనిసరిగా ఉండాలని సూచించారు. గత నెల 27న విడుదల చేసిన ఓటరు ముసాయిదా జాబితా ప్రకారం యలమంచిలి మండలంలో 67 పోలింగ్ కేంద్రాల పరిధిలో 55,671 మంది ఓటర్లున్నట్లు వెల్లడించారు. వీరిలో పురుషులు 26,791, మహిళలు 28,870 మంది, ఇతరు 10 మంది ఉన్నట్లు తెలిపారు. రెండు రోజులపాటు నిర్వహించనున్న ప్రత్యేక శిబిరాల్లో కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ప్రకటించిన ఓటరు జాబితాలో అభ్యంతరాలు, మార్పులు, చేర్పులుండే సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగపర్చుకోవాలని, తద్వారా పారదర్శక ఓటర్ల జాబితాకు సహకరించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు నాని మృతికి సంతాపం



కర్రి నాని (ఫైల్)



నాని మృతదేహం వద్ద డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ

మునగపాక: మండలంలోని పల్లపు ఆనందపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు కర్రి నాని గురువారం రాత్రి గుండె పోటుతో మరణించారు. గురువారం రాత్రి భోజనం చేసిన నాని శుక్రవారం తెల్లవారు జామున చూస్తే, విగత జీవిగా కనిపించడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలిచిన నాని మృతిని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమారవర్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, వైస్ ఎంపీపీ బోజా లక్ష్మీ శ్రీనివాసరావుతో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నాని మృతికి సంతాపం తెలిపారు. నాని తల్లి కర్రి సంజీవి పల్లపు ఆనందపురం ఎంపీటీసీగా ఉన్నారు.

వరినాట్లు ఎండిపోలేదు



పంచదార్లలో వరి నారుమడిని పరిశీలిస్తున్న వీఏఏ సరోజిని

రాంబిల్లి: మండలంలో ఇప్పటి వరకు వర్షాభావం కారణంగా వరినాట్లు ఎక్కడా పూర్తిస్థాయిలో ఎండిపోలేదని ఏవో సి.సుమంత తెలిపారు. పంచదార్ల పరిధిలో 5 సెంట్ల పొలంలో వరినారు మడి మాత్రం పూర్తిస్థాయిలో ఎండిపోయిందన్నారు. ఈ ఎండిపోయిన వరి నారుమడిని వీఏఏ సరోజిని పరిశీలించారు. మండలంలో పలు చోట్ల మెరక పొలాల్లో వరినాట్లకు నీరందక బీటలు వారుతున్నప్పటికీ ప్రస్తుతానికి ఎటువంటి నష్టం జరగలేదని ఏవో స్పష్టం చేశారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం, కోటఉరట్ల

F.No:-2, తే.3-11-2023ది

విషయం: వేలం పాటలు - బహిరంగ వేలం పాటలు - కోటఉరట్ల మండలం, కోటఉరట్ల గ్రామ పంచాయతీ సర్వే నెం. 316. యూక్లిప్టస్ చెట్లు తొలగించు, గుత్త హక్కులు పొందుటకు బహిరంగ వేలం ద్వారా తేది 08-11-2023ది ఉదయం గం॥ 11-00లకు నిర్వహించుటకు పేపరు ప్రకటన ద్వారా తెలియపర్చుట గూర్చి.

సూచిక: 1. R.C.No. 568/2023/A7, తే.11-10-2023ది శ్రీ జిల్లా ఫారెస్టు అధికారి, అనకాపల్లి డివిజన్ నర్సీపట్నం వారి ఉత్తర్వులు ప్రకారము.

2. R.C.No. 2/2023 పంచాయతీ కార్యదర్శి – కోటఉరట్ల తే. 19-10-2023ది.

3. R.C.No. 240/2023/SA తే॥ 02-11-2023ది తహశీల్దారు కోటఉరట్ల వారి లేఖ.

పై 1వ మరియు 2వ సూచికల ప్రకారము శ్రీ మండల తహశీల్దారు - కోటఉరట్ల వారి లేఖపై, 3వ సూచిక ప్రకారం సర్వే నెంబరు 316 రెవెన్యూ వారి పరిధిలో గల భూమి నందు యూక్లిప్టస్ చెట్లు బహిరంగ వేలం ద్వారా, పై 1వ సూచిక ప్రకారం శ్రీ జిల్లా ఫారెస్టు అధికారి వారి మద్దతు ధర ప్రకారం తే॥ 08-11-2023ది బుధవారం ఉదయం గం॥ 11-00లకు కోటఉరట్ల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించబడును. కావున సదరు వేలంపాటకు ఆసక్తి గల అసామీలు యీ దిగువ నిబంధనలకు లోబడి, బహిరంగ వేలంపాట నందు పాల్గొనుటకు అవకాశం కలదు. కావున సదరు విషయం గ్రామపంచాయితీ పరిధిలో మరియు, ఇతర ప్రాంతంలలో గల పౌరులకు తెలియజేయడమైనది.

షరతుల నందు తెలియపర్చిన విధముగా, ధరావత్తు నగదు రూపేణా చెల్లించి వేలం పాటలో పాల్గొనవలసి ఉన్నది.

వ. నెం.	వేలం పాట వివరము	చెల్లించవలసిన ధరావత్తు	రిమార్కు
1	కోటఉరట్ల గ్రామపంచాయతీ రెవెన్యూ సర్వే నెంబరు-316 నందు గల యూక్లిప్టస్ చెట్లు వయస్సు మీరి ఉన్నందున నరికి వేయుటకు బహిరంగ వేలంనందు పాల్గొనుట గూర్చి	రూ॥ 50,000/- నగదును చెల్లించి వేలం పాటలో పాల్గొనవలసి ఉన్నది	చెట్లు విలువ 470 టన్నులు

గమనిక: బహిరంగ వేలం నందు పాల్గొనువారు ఈ దిగువ షరతులకు లోబడి బహిరంగ వేలం నందు పాల్గొనవలెను.

షరతులు: 1. ధరావత్తు సొమ్ము రూ॥50,000/-లు నగదుగా మాత్రమే చెల్లించవలసిఉన్నది.
2. వేలం పాట ఖరారు అయిన అసామి ధరావత్తు మినహా మిగిలిన అసామిల యొక్క ధరావత్తు వెంటనే తిరిగి చెల్లించబడును.
3. వేలంపాట నందు పాల్గొన్న హెచ్చుపాటదారుని ధరావత్తు పంచాయతీ వారి అధీనంలో ఉంచబడును. పంచాయతీ వారు నిర్ణయించిన తేది లోపల అనగా పంచాయతీ, మరియు రెవెన్యూ సిబ్బంది, ఫారెస్టు వారి అధీనంలో ఎంపిక కాబడిన హెచ్చుపాటదారునకు పాట జరిగిన తేది నుండి 15 దినములు కాలవ్యవధిలో సదరు యూక్లిప్టస్ చెట్లు నరుకు సమయం ముందుగా అనగా 15 దినములు లోపల వేలం పాటనందు హెచ్చుపాటదారుడు చెల్లించవలసిన నగదు పంచాయితీ వారికి చెల్లించి, తగు రసీదు పొంది చెట్లు నరుకుటకు అధికారము కలదు. లేనిచో వారియొక్క వేలం పాటను రద్దు చేయుటకు ఈ దిగువ సంతకందారునికి పూర్తి అధికారము కలదు.
4. వేలం పాటను ఎట్టి అసమాన పరిస్థితులు సంభవించినచో మరియు సర్కారు వారి రేటు దాటనిచో వేలం పాటను వాయిదా వేయుటకు గాని, లేదా రద్దు చేయుటకు గాని ఈ దిగువ సంతకందారునకు పూర్తి అధికారము కలదు.

సం/- బి.ఎ. సుబ్రహ్మణ్యం
కార్యనిర్వహణాధికారి, గ్రామ పంచాయితీ, కోటఉరట్ల